క్లుప్తంగా

అయోధ్య నుంచి చేరిన అక్షింతలు

కాశినాయన (కలసపాడు) : అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తై 2024 జనవరి 22వ తేదీన విగ్రహ ప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్, జనహిత సంఘాల ఐక్యతతో అయోధ్య నుండి అక్షింతలు రాష్ట్రాలకు, జిల్లా కేంద్రాలకు, మండల కేంద్రాలకు పంపించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కలసపాడు గ్రామం కుమ్మరివీధిలోని రామాలయానికి డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో ఊరేగింపుగా అక్షింతలు చేరుకున్నాయి.

నూతన నియామకం


తల్లం సుధాకర్

మైదుకూరు : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డైరెక్టర్‌గా మైదుకూరుకు చెందిన తల్లం సుధాకర్ ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన వాసవి క్లబ్ ఐకాన్ సమావేశంలో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మధురైకి చెందిన రవిచంద్రన్ తన నూతన కమిటీని ఎంపిక చేశారు. అందులో తల్లం సుధాకర్ మల్టిపుల్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. తల్లం సుధాకర్ వాసవి క్లబ్ ఉమ్మడి కడప జిల్లా గవర్నర్‌గా కూడా పనిచేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు : స్థానిక బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదార నరేంద్ర రావు ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. బీజేపీ ఉపాధ్యక్షులుగా టి.రామ్మోహన్‌రెడ్డి, ఎం.సుధాకర్ రాజు, జి.శివనాగిరెడ్డి, జి.గంగాధర్‌రెడ్డి, తిరుమలశెట్టి కోదండపాణి, ప్రధాన కార్యదర్శులుగా పరమేశ్వరరావు, వై.చలపతి రావు, వడ్డి వెంకటసుబ్బయ్య, కోశాధికారిగా కోటా వెంకటసుబ్రహ్మణ్యం, కార్యదర్శులుగా ముత్యాలు శ్రీశ్రీ, ఐ.నరసింహా, పి.వంశీకృష్ణ, సుంకు గురుప్రసాద్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడుగా చెన్నా మోహన్ కుమార్, బీజేవైఎం పట్టణాధ్యక్షుడుగా జి.వరప్రసాద్ రెడ్డి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షులుగా ఎస్.కుమారి, ఎస్సీ మోర్చా పట్టణాధ్యక్షుడుగా ఎస్.జమ్మయ్య, ఎస్టీ మోర్చా పట్టణాధ్యక్షుడుగా రాగాల రమణయ్య, మైనారిటీ మోర్చా పట్టణాధ్యక్షుడుగా ఎస్.మౌలా, కార్యవర్గ సభ్యులు చిన్న, మురళిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు హాజరయ్యారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


కంబగిరి రావును సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షుడు కంబగిరి రావు తెలిపారు. స్థానిక పెన్నానది తీరంలోని కొవ్వూరు కల్యాణ మండపంలో ఆదివారం ప్రొద్దుటూరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస ధాత్రి వనభోజనం, నూతన అధ్యక్ష ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీలు, విచిత్ర వేషధారణల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మధ్యాహ్నం 450 మందికిపైగా బ్రాహ్మణులు వనభోజనంలో పాల్గొన్నారు. భోజన వితరణ చేసిన చాగంటి వెంకట సత్యప్రసాద్ శర్మ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు ఆర్‌జీ ప్రసాద్, కార్యదర్శి రంజన్ శర్మ, బ్రాహ్మణ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

మైదుకూరు : కడపలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో మైదుకూరుకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. గీతా జయంతి సందర్భంగా ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారు శ్రీలలితా దేవాలయంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 8, 9 తరగతుల విభాగంలో (సీనియర్) మైదుకూరుకు చెందిన పందిటి చిన్మయి ప్రథమ స్థానంలో, 6, 7 తరగతుల విభాగంలో (జూనియర్) పందిటి సుహృదయ రాయుడు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు పొందారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ధర్మప్రచార పరిషత్ మైదుకూరు ప్రాంత నాయకుడు అనిల్ తెలిపారు.

సర్వమత సమ్మేళనమే దేశ గొప్పతనం


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : సర్వమత సమ్మేళనమే భారతదేశం గొప్పతనం అని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేట టౌన్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిగాయి. బీసీ కాలనీలోని చర్చి వద్ద నుంచి బస్టాండ్ కూడలి వరకు క్రిస్మస్ స్టార్‌ను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ తినిపించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


భద్రావతి, భావన్నారాయణ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్) పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ భద్రావతి భావన్నారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. భద్రావతి భావన్నారాయణ స్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆశీనులను చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య, మంగళవాయిద్యాల మధ్య స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిపారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పాల్గొని తిలకించారు. మధ్యాహ్నం 10వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడు మేరువ పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి సోము జానకిరామయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు నందం లక్ష్మణకుమార్, కోశాధికారి గునిశెట్టి సురేష్‌బాబు, నందం రామయ్య, నరసింహామూర్తి, ప్రసాద్, ఆనంద్, సాయికృష్ణ, సదానందం, పద్మశాలీయ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా బిందెసేవ


బిందె సేవలో దేవాంగ కులస్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని ఆవాహన చేసిన కలశాలను తలమీద ఉంచుకుని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి వెంకటరమణ, దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాంగ కల్యాణ మండప అధ్యక్షుడు చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, శివ, లక్ష్మీనారాయణ, వీరప్రసాద్, నరేంద్ర, జలంధర్, వీర మోహన్, వేణుగోపాల్, వెంకట ప్రసాద్ దేవాంగులు పాల్గొన్నారు. దేవాంగ పేటలోని జ్యోతి మండపం నుంచి ఆదివారం అర్ధరాత్రి జ్యోతి ఉత్సవాలను నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఈ జ్యోతి మహోత్సవాలను నిర్వహించనున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ


పడిపూజలో భాగంగా 18 మెట్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక తెలుగుగంగ కాలనీ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయ నవమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన పదునెట్టాంబడి (పడిపూజ) పూజ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున 5 గంటల నుంచి గణపతి హోమం, అభిషేకం, అర్చనలు నిర్వహించి సాయంత్రం 5 గంటలకు గుడి ఉత్సవం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పడిపూజలో అయ్యప్పభక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఇందులో భాగంగా 18 మెట్లను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్లపైభాగాన అయ్యప్పస్వామితో పాటు గణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామి ప్రతిమలను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు. పూజలో భాగంగా నరసారావుపేటకు చెందిన మల్లికార్జున స్వామి బృందంచే ఏర్పాటు చేసిన అయ్యప్ప భక్తి గీతాల విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సలహాదారులు బొమ్ము వీరనారాయణరెడ్డి, కె.రామసుబ్బారెడ్డి, టి.వెంకటసుబ్బయ్య, ఎన్.వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బారెడ్డి, గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

• ఘనంగా బిల్వార్చన


దశ సహస్రనామ బిల్వార్చనలో సైకత లింగం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సైకత లింగానికి దశ సహస్రనామ బిల్వార్చనను ఘనంగా నిర్వహించారు. రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

నగరేశ్వరునికి రుద్రాభిషేకం


నగరేశ్వరునికి రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఉద్యానవనంలో ఆదివారం రాత్రి శ్రీపార్వతి సమేత నగరేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. 102 మంది సుహాసినులు అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. పసుపు, కుంకుమ దీపాలతో అమ్మవారిని అర్చించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


సెమీ క్రిస్మస్ వేడుకల్లో భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు : స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో, నైట్ షెల్టర్‌లో సెమీ క్రిస్మస్ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ రాయలసీమ సెక్షన్ ఆఫ్ సెవెంత్ డే అడ్వెంటిస్ట్ చర్చి సూపర్‌వైజర్ పాస్టర్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెవెంత్‌డే పాస్టర్ ప్రకాష్, పాస్టర్ యోహాన్, ఆర్‌డీఎస్ అధ్యక్షుడు దేవదాసు, ప్రభావతి, సుదర్శనమ్మ, జ్యోతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కేతవరంలో..

చాపాడు: మండలంలోని కేతవరం గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్‌కు ముందు సెమీ క్రిస్మస్ జరుపుకోవటం వలన ఆ దేవుడి ఆశీస్సులు ఉంటాయని పాస్టర్ తెలియజేశారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా చర్చి ఆవరణంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్ద జయరాజు, గ్రామ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రొద్దుటూరు : స్థానిక వివేకానంద కాలనీలోని జయశ్రీ జూనియర్ కాలేజీలో ఆదివారం లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర వైస్ చైర్మన్ పామిడి వీరయ్య, సెక్రటరీ రాము నాయుడు, రాయలసీమ జిల్లాల రీజనల్ సెక్రటరీ జె.శ్రీనివాసులు, డైరెక్టర్ జె.రామసుబ్బయ్య మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.రామచంద్ర, కడప జిల్లా చైర్మన్ వెంకటయాదవ్, డైరెక్టర్ ఎన్‌సీ ఓబులయ్య, వైస్ చైర్మన్ ఉదయభాస్కర్, జిల్లా మహిళా విభాగం సెక్రటరీ కృష్ణవేణి, పట్టణ చైర్మన్ ఎస్.సుధార్, జనరల్ సెక్రటరీ ఏవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల రక్షణ బాధ్యత అందరిదీ

బద్వేలు అర్బన్ : మానవహక్కులు అనేవి మన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు సంబంధించినవని, అటువంటి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదీ అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.ఎస్.ప్రసాద్, పూలే, అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.పిచ్చయ్య పేర్కొన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవహక్కుల పరిరక్షణ చట్టం వ్యక్తి జీవితం, స్వేచ్ఛ, సమానత్వం, పరువు మర్యాదలకు సంబంధించినవని, కానీ ఆ హక్కులను ఎవరూ గౌరవించకపోవడం శోచనీయమన్నారు. బీసీ చైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.సి.రమణ, సామాజిక చైతన్యవేదిక రాష్ట్ర నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక సిద్దవటం రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్, హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మానవహక్కులు, వాటి పరిరక్షణ గురించి ప్రజలను చైతన్యపరచాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్స్యూమర్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసులు, వినియోగదారుల రక్షణ మండలి జిల్లా కార్యదర్శి బి.గురుమూర్తి, అంబేడ్కర్ భవన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జకరయ్య పాల్గొన్నారు.

ఆదర్శప్రాయంగా నిలవాలి


రెడ్ల వన భోజనాల కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

– ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : రెడ్డి కులస్థులందరూ ఐకమత్యంగా ముందుకు సాగి ఆదర్శప్రాయంగా నిలవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మైదుకూరు రోడ్డులోని ఎస్ఎంఎస్ కల్యాణ మండపంలో రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెడ్ల వన భోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రెడ్డిసేవా సంఘం రాబోవు రోజుల్లో మిగతా సంఘాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీదేవి మాట్లాడుతూ దాతృత్వానికి మారుపేరైన రెడ్డి కులంలో పుట్టడం మనందరి అదృష్టమని, ప్రతి రెడ్డి సోదరుడు కులంలోని పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఘనమైన చరిత్ర కలిగిన రెడ్డి కులస్తులు ఐక్యతతో ముందుకు సాగి విద్య, రాజకీయ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఓసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకటసుబ్బారెడ్డి, రెడ్డిసేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగసాని సాంబశివారెడ్డి, భూమిరెడ్డి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వంకెల పెద్దపోలిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, సీనియర్ న్యాయవాది బ్రహ్మారెడ్డి, రెడ్డిసేవా సంఘం నాయకులు పి.వి.కృష్ణారెడ్డి, సి.రామచంద్రారెడ్డి, గంగసాని జయసుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం మునెయ్యస్వామి


మునెయ్యస్వామి ఆలయం


బిందెసేవ మహోత్సవంలో తొగట వీరక్షత్రియులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మునెయ్యస్వామి భక్తులు కోరిన కోర్కెలను తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందాడు. ప్రొద్దుటూరులోని ముక్తిరామేశ్వరం ఆలయం పరిసర ప్రాంతానికి 400 ఏళ్ల కిందట కర్నూలు జిల్లా బనగానపల్లె యాగంటి నుండి వచ్చిన ఓ బాలుడు ఇక్కడే ఉండేవాడని.. ఆయన మౌనవ్రతం చేపట్టడం చేతనే ఆయనను మునిస్వామి, మునెయ్య స్వామిగా ప్రసిద్ధి చెందాడని ప్రతీతి. తదనంతరం ఆయన 40 ఏళ్ల వయసులో ఇక్కడే జీవ సమాధి అయ్యాడు. మునయ్యస్వామి అనుగ్రహంతో పుట్టిన పిల్లలకు మునయ్య, మునెమ్మ అని పేరు పెడుతూ తమ ఇంటి దేవునిగా స్వామి వారిని ఇక్కడి భక్తులు కొలుస్తున్నారు. కాగా స్వామికి మహిళలే పూజలు నిర్వహించడం విశేషం. మునెయ్య స్వామి కార్తీక మాసం చివరి సోమవారం జీవ సమాధి అయ్యాడు. అందువల్ల ఆనాటి నుంచి ప్రతి చివరి కార్తీక సోమవారం నాడు ఘనంగా మునెయ్యస్వామి తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కోళ్లను, మేకలను బలి ఇస్తారు. తలనీలాలు, పుట్టు వెంట్రుకలను ఇస్తారు. ఆలయ గోపురం లోపలి వైపున గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి జాతీయ నాయకుల విగ్రహాలు భక్తులలో దేశభక్తిని పెంపొందిస్తున్నాయి. తిరుణాల సందర్భంగా దుకాణాలను ఏర్పాటు చేశారు. రాయలసీమలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించనున్నారు.

■ స్థానిక మునెయ్యస్వామి ఆలయంలో తొగట వీర క్షత్రియులు చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలకు సంబంధించి బిందె సేవ మహోత్సవాన్ని నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య కలశాలను తలపై ఉంచుకుని నృత్యం చేస్తూ బిందె సేవ మహోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

రాజుపాళెం : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు ప్రశాంతి, ఆస్మా పేర్కొన్నారు. కొర్రపాడులో ఆదివారం ఫ్రెండ్స్ బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 170 మంది రోగులకు వైద్య చికిత్సలు అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఉమర్ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగన్న, జాతీయ బీసీ సమాఖ్య సంఘం మండల అధ్యక్షుడు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్‌లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని డివిజనల్ రైల్వే బోర్డు మెంబర్ వై.షామీర్‌బాషా తెలిపారు. ఆయన ఆదివారం రైల్వే స్టేషన్‌ను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు స్టేషన్‌లో కమర్షియల్ క్లర్క్‌ను నియమించడంతో పాటు ప్రయాణికుల కోసం పలు వసతులను కల్పించాలని కోరారు. సమ్యలను డీఆర్ఎం మనీష్ అగర్వాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమర్షియల్ క్లర్క్ జనార్దన్, స్టేషన్ మాస్టర్ భానుప్రకాష్, హెచ్‌డీఆర్ యూసీసీ మెంబర్ మాతయ్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

అట్లూరు : వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను నెరవేరిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వీఆర్‌ఏల జీతం పెంచాలని కోరారు.

త్వరలో డ్రైనేజీ కాలువలు నిర్మిస్తాం

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డులో త్వరలో డ్రైనేజీ కాలువలను నిర్మిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. 40వ వార్డు పరిధిలోని బుర్రసాధు మఠం ప్రాంతంలో ఆదివారం బంగారు మునిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ నాగేంద్ర, స్థానికులు మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని వైస్ చైర్మన్‌ను కోరారు. సంబంధిత అధికారులతో చర్చించి కౌన్సిల్ అజెండాలో పెట్టిన అనంతరం కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ వైస్ చైర్మన్ వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లు సంజీవకర్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలు అందించేందుకే సచివాలయాలు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చౌడూరు గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక రకాల సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నిత్యం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ కారణంగా ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం చరిత్రలో తొలి మారు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను కొత్తగా ఏర్పాటు చేసిందని, సచివాలయ వ్యవస్థ ద్వారానే ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలంకూరు పార్వతమ్మ బోరెడ్డి, గ్రామ పంచాయతీ సర్పంచ్ చంద్రుడు, ఎంపీటీసీ భరత్‌కుమార్‌రెడ్డి, డీలర్ సుబ్బారెడ్డి, చిన్నబోరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో త్రైతసిద్ధాంత ప్రచారం


ప్రచారం చేస్తున్న సభ్యులు

పోరుమామిళ్ల : పట్టణంలోని వినాయక నగర్, మైదుకూరురోడ్ ప్రాంతాలలో ఆదివారం ప్రభోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు ఎ. రమేష్ మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంతం ప్రచారం చేస్తున్నామని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మల వివరము తెలుసుకొనుట ద్వారా ధర్మస్థాపన జరుగుతుందన్నారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలోని 16, 17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి ఆధారమన్నారు. ఇందూ జ్ఞానవేదిక సభ్యులు శివ, భాగ్యం, సుభాషిణి, లక్ష్మీదేవి, వెంకటేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.